క్లుప్తంగా

మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం



మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పౌర్ణమి సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో చండీ హోమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, వేదపారాయణ దారులు పూజలు నిర్వహించారు. 62 దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో వెంకటేశ్వరస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీ పద్మావతీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు బుధవారం జ్యేష్ఠ మాసము జ్యేష్ఠ నక్షత్రము సందర్భమున శ్రీ స్వామి వారికి, శ్రీ అమ్మవార్లకు కాకులపాటి చలపతిరావు దంపతులచే వట్టి వేళ్ళతో అలంకారం నిర్వహించారు. ఈ ఏర్పాట్లను వంశపారంపర్య ధర్మకర్త మంతెన రామ్ కుమార్ రాజు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజులు పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పౌర్ణమి సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన లీల ధనరాజ్, బొలిశెట్టి నాగేశ్వరరావు, రంగమాంబ దంపతులచే ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, శ్రీచక్ర నవవర్ణార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద మంత్రాలతో లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టూటౌన్ ఎస్ఐగా రామారావు



చిన రామారావు

భీమవరం: భీమవరం టూటౌన్ ఎస్‌గా కె.రామారావు బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న ఇజ్రాయేలు బదిలీ కావడంతో కాకినాడ జిల్లా పెదపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న రామారావు భీమవరం బదిలీపై వచ్చారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

పెనుగొండ: స్థానిక దళిత నాయకులు నక్కా శాస్త్రి, శర్మలపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గోగి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పెనుగొండలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాల సామాజిక వర్గానికి చెందిన వారని, వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దుష్ప్రచారం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దాసరి శివ, పచ్చమాల అంజిబాబు, వర్ధనపు రవి, కుసుమే రాజులు పాల్గొన్నారు.

ఘనంగా దేవల మను బ్రహ్మస్వామి జయంతి

నరసాపురం: దేవాంగుల కులదైవం దేవల మనుబ్రహ్మస్వామి జయంతి వేడుకను స్థానిక 12వ వార్డులో శ్రీచౌడేశ్వరీదేవి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మావూరి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ గోరు సత్తిబాబు మాట్లాడుతూ శివుని జ్ఞాన నేత్రం నుంచి దేవాంగులు పుట్టుకొచ్చారని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. వస్త్రాన్ని పరిచయం చేసిన ఘనత దేవాంగులకు ఉందని చెప్పారు. దేవల సుబ్రహ్మణ్యం జయంతిని ప్రతిఏటా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకుంటామన్నారు.

అడుగంటిన మంచినీటి చెరువులు

- అధ్వానంగా కుళాయి నీటి సరఫరా
- మంచినీటి చెరువులో జలకాలాడుతున్న పశువులు
- పట్టించుకోని నగర పంచాయతీ సిబ్బంది



స్థానిక నగర పంచాయతీ పరిధిలోని గాలిబ్ చెరువులో పశువులు సేద తీరుతున్న దృశ్యం



కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో అడుగంటిన మంచినీటి చెరువు

ఆకివీడు: మంచినీటి సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది మాత్రం ఫిడేలు వాయిస్తున్నట్లుందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా గత ఐదేళ్లు మంచినీటి చెరువుల్ని పూర్తిగా నింపారు. గట్లు పొల్లిపోరలినట్లుగా నిండుకుండను తలపిస్తూ చెరువులుండేవి. వేసవిలో నీటి ఎద్దడి తలెత్త లేదు. గ్రామంలో ప్రస్తుతం నాలుగుమంచినీటి చెరువులున్నాయి. వీటి ద్వారా పట్టణ ప్రజలకు రక్షిత నీటి పథకాల ద్వారా ఫిల్టర్ చేసిన నీటిని సరఫరా చేసేవారు. తీవ్ర నీటి ఎద్దడి ఉన్న కొద్ది రోజులు మాత్రం ఒంటిపూట నీటిని ఒక ఏడాది సరఫరా చేశారు. మొత్తం మీద నీటి సమస్య తలెత్తలేదు. ఈ ఏడాది మంచినీటికి ప్రజలు జనవరి నుంచే కటకటలాడిపోయారు. చెరువుల్లో కలుషిత నీరు చేరడంతో మరింతగా ఇబ్బంది పడాల్సి వచ్చింది. అధికారులు స్థానికంగా నివాసం ఉండకపోవడం, పట్టణంలో పర్యటించి పరిశీలన చేయకపోవడం, ప్రజా సమస్యల్ని పట్టించుకోకపోవడం, కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు మొరపెట్టుకున్నా మంచినీటిసమస్యకు మార్గం చూపించలేదు. ఈ ఏడాది మే నెలలో కుళాయిల ద్వారా పసర్లుదేరి, దుర్వాసన వెదజల్లుతోన్న నీటిని సరఫరా చేస్తున్నారు. కాలువల ద్వారా సకాలంలో నీటిని విడుదల చేయకపోవడంతో ఈ సమస్య మరింత జటిలమైంది.

ఉన్న నీటిలో పశువులు జలకాలాటలు

స్థానిక గుమ్ములూరు రోడ్డులోని 16 ఎకరాల మంచినీటి చెరువు గాలిబ్ చెరువులో గత కొన్ని రోజులుగా పశువులు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ చెరువులోనే సేదతీర్చుకుంటున్నాయి. ఆ ప్రాంతంలోని ఖాళీ చెలకల్లో మేత మేసి, మండుటెండల్ని తట్టుకోలేక చెరువులోనే ఉండిపోతున్నాయి. బుధవారం 16 పశువులు గాలిబ్ చెరువులో కన్పించాయి. ప్రజలకు మంచినీటిని అందించే గాలిబ్ చెరువు పట్ల నగర పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరించడం వల్లే మంచినీటి వ్యవస్థ పూర్తిగా పాడైపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులతో కూడిన నీటిని సరఫరా చేస్తున్నారని వాపోతున్నారు. ఇదే నీటిని మరికొన్ని రోజులు సరఫరా చేస్తే చర్మ, ఇతర వ్యాధులు విజంభిస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలువలు వదిలినా మోక్షమెప్పుడో?

కాలువలకు నీటిని విడుదల చేసినా శివారు ప్రాంతం ఉండి నియోజకవర్గంలో మంచినీటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు గ్రామాల్లోని మంచినీటి చెరువులు అడుగంటాయి. బురద నీటిని ప్రజలకు సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలు గ్రామాల్లోని కార్యదర్శులు చెబుతున్నారు. పంట కాల్వల్లో మురుగునీరు, చేపలు, రొయ్యల చెరువుల నీరు వదిలివేయడం వల్ల, చెత్తా చెదారం కొట్టుకుపోవలసి ఉంది. కాలువులు వదిలి 11 రోజులు గడిచినా నేటికీ ఆయా పంట కాల్వల్లో నిండుగా నీరు లేదు. దీంతో మురుగునీటితో కొత్త నీటి ప్రవాహం మందకొడిగా సాగుతోంది. మరో ఐదారు రోజుల వరకూ కాలువల్లోని నీటిని చెరువుల్లోకి నింపే అవకాశం లేదంటున్నారు. మంచినీటి మరి కొన్ని రోజులు తప్పదనే అధికారులు చెబుతున్నారు.

దాహార్తి తీరుస్తున్న మైక్రో ఫిల్టర్లు

ఇటీవల కొన్ని గ్రామాల్లో దాతలు, జలజీవన్ మిషన్ నిధుల ద్వారా స్థానిక ఎమ్మెల్యే ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణంరాజు ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్లు ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఫిల్టర్ చేసిన స్వచ్ఛమైన నీరు అందడంతో ప్రజలు ఆర్వో ప్లాంట్‌ల దగ్గర క్యూకట్టాల్సిన అవసరం లేకుండా ఉంది.

పతాకస్థాయికి కూటమి అరాచకాలు



ఈద జాషువా

భీమవరం: రాష్ట్రంలో కూటమి అరాచకాలు రాష్ట్రస్థాయికి చేరాయని, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన ప్రతిక స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం దారుణమని వైఎస్సార్ సీపీ మేధావుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఈద జాషువా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జర్నలిజాన్ని నిబద్ధత, ఆత్మ విశ్వాసంతో స్పష్టంగా ప్రతి లైవ్ డిబేట్ ఆయన కొనసాగించే తీరు ఎంతో మార్గదర్శకంగా ఉంటుందన్నారు. డిబేట్‌లో దొర్లిన పొరపాటుకు శ్రీనివాసరావు వివరణ ఇచ్చిన ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వం అరాచకపాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాక్షి పత్రికా కార్యాలయాలపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలని జాషువా డిమాండ్ చేశారు.

సాక్షి కార్యాలయాలపై దాడులు సరికావు



బదుగు బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు

ఉండి: కూటమి నాయకులు కావాలనే సాక్షి కార్యాలయపై దాడులకు దిగుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బదుగు బాలాజీ అన్నారు. సాక్షి కార్యాలయాలపై కూటమి నాయకులు చేస్తున్న దాడులపై ఆయన బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి ప్రతికా కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతూ శృతిమించి ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. కొత్త సంస్కృతికి కూటమి నాయకులు తెరలేపారన్నారు. ఇటువంటి దాడులు సరైనవి కావని హితవు పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి కారణంగా గురువారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసయ్య అగ్రహారం, కుముదవల్లి రోడ్, పార్క్ వీధి, ఎఫ్‌సీఐ కాలనీ, మార్కెట్ యార్డ్, భాష్యం స్కూల్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

ఎక్సైజ్ కేసులో నలుగురి బైండోవర్



భీమవరం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసిన ఎక్సైజ్ కేసులో నిందితులు

భీమవరం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురు నిందితులను బుధవారం భీమవరం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు భీమవరం ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు చెప్పారు. భీమవరం మండలానికి చెందిన బస్వా అశ్వినికుమార్, చిలుకూరి శ్రీను, కట్టా సత్యనారాయణ, పుచ్చకాయల నారాయణ మద్యం కేసులో పాత ముద్దాయిలన్నారు. నలుగుర్ని తహసీల్దార్ ఆర్ రాంబాబు వద్ద బైండోర్ చేశామని ఏడాది కాలంలో పైనలుగురు ఎక్సైజ్ నేరం చేస్తే రూ. లక్ష జరిమాన చెల్లించాల్సి ఉంటుందని బలరామరాజు తెలిపారు.

చచ్చింది సరే... తొలగించేదెప్పుడు!

మందు పిచికారీతో చనిపోయిన గుర్రపుడెక్క



మండలంలోని చినకాపవరం డ్రెయిన్‌లో రసాయనిక మందు పిచికారీతో చనిపోయి ఎండిన గుర్రపుడెక్క

ఆకివీడు: మండలంలోని చినకాపవరం డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కపై రసాయనిక మందు పిచకారీ చేయడంతో ఎండిపోయింది. డ్రెయిన్ ఆది నుంచి అంత్య వరకూ గుర్రపుడెక్క, కిక్కిస విపరీతంగా పెరిగిపోయింది. గతంలో చినకాపవరం డ్రెయిర్‌లో కిక్కిస, తూడు తొలగించి, పంటిపై పూడికలు తీయడంతో పనులు అంతంత మాత్రంగానే జరిగాయి. దీంతో విపరీతంగా గుర్రపుడెక్క, కిక్కిస పెరిగిపోయాయి. ఉప్పుటేరు నుంచి ఆకివీడులోని సమతానగర్ వంతెన వరకూ కిక్కిస ఎగబ్రాకుతూ వస్తుంది. గుమ్ములూరు లాకుల వద్ద నుంచి దుంపగడప వరకూ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క పేరుకుపోయింది. డ్రెయిన్‌కు ఇరువైపులా గట్లు ఆక్రమణలకు గురయ్యాయి. మరికొన్ని చోట్ల చేపలు, రొయ్యల చెరువు గట్లు డ్రెయిన్ గట్టుకు చేర్చి వేయడంతో డ్రెయిన్ తవ్వకానికి అనుకూలంగా లేదు. దీంతో డ్రెయిన్‌లో గుర్రపుడెక్క మేట వేసి పూడికలు పేరుకుపోతున్నాయి. గుమ్ములూరు వంతెన వద్ద డ్రెయిన్‌లో మేటలు వేయడంతో ప్రజలు నడిచి వెళ్లిపోతున్నారు. ఈ ప్రాంతంలో అనేకసార్లు మందు పిచికారీ చేసి వదిలివేశారు. భారీ వర్షాలకు కూడా కుళ్లిన డెక్క తొలగకపోవడం, అక్కడే ఉండిపోవడంతో పూడికలు భారీగా పేరుకుపోయాయి. నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బంది కల్గిస్తున్నాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కొనసాగుతోంది. డ్రెయిన్‌లో కిక్కిరిసిన గుర్రపుడెక్కపై స్ప్రేయింగ్ చేయడంతో డెక్క చనిపోయింది. దీనిని గట్లపైకి తొలగించినప్పుడే కాలువలో నీటి ప్రవాహం సక్రమంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. గతంలో వలేనే వదిలివేస్తే ముంపునీటికి పూర్తి స్థాయిలో కొట్టుకుపోవడం లేదు. వర్షాలు కురిసి, భారీగా ముంపువస్తేనే కుళ్లిన గుర్రపుడెక్క తొలగుతుందంటున్నారు. గతంలో రసాయనిక మందు పిచికారీ చేయకుండానే ఉప్పుటేరు ద్వారా సెలినిటీ నీరు డ్రెయిన్‌లోకి చొచ్చుకువచ్చి కోళ్ల పర్రు వంతెన వరకూ గుర్రపుడెక్కను చంపివేసింది.

గిరిజన విద్యార్థిని హత్య దారుణం



భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

భీమవరం: గిరిజన విద్యార్థిని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ అనంతపురం పట్టణానికి చెందిన విద్యార్థిని తన్మయిని కిరాతంగా హత్యచేయడం దారుణమన్నారు. గత ఏడాది కాలంగా ఎస్సీ, ఎస్టీ మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తక్షణం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టెం శుభాకర్, గెడ్డం జార్జ్, అంబటి ఆనంద్‌కుమార్, బి సతీష్, ఎన్ మోజేస్, ఎస్ మహేష్, పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



పాలకోడేరులో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు

పాలకోడేరు: పాలకోడేరు గ్రామంలో కొత్తపేట, మంగయ్య గారి చెరువుగట్టు వద్ద నూతనంగా నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఉండి శాసనసభ్యుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి జనసేన పార్టీ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, డెల్టా నీటి సంఘం అధ్యక్షులు కునాధ రాజు మురళి కృష్ణంరాజు, కొత్తపల్లి నాగరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఎంపీడీవో వి. రెడ్డియ్య, మండల తహసీల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం శ్రామికులకు వరం



గొల్లవానితిప్పలోని సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధి కార్మికులు

భీమవరం అర్బన్: ఉపాధి హామీ చట్టం శ్రామికులకు వరంలా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి వేతనాలు చెల్లించడానికి మీనమేషాలు లేక్కిస్తున్నారని సీఐటియూ జిల్లా నాయకులు ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెక్కాడితే కాని డొక్కాడని ఉపాధి కూలీల రెండు నెలల సొమ్ములు ఇవ్వకపోతే వారు ఎలా బతుకాకేదని, మరో పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ ఛార్జీలు సామన్య ప్రజలు సతమతమవుతున్నారన్నారు. అనారోగ్యాలను లెక్క చేయకుండా ఎండల్లో పనిచేస్తే వేతనాలు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దెత్తున ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలతోనే పలు శాఖలు

ఆకివీడు: బదిలీల పర్వంలో పలు శాఖల్లో ఉద్యోగాల భర్తీ ఎండమావిగానే ఉంది. మండల స్థాయిలోని ప్రధాన శాఖల భర్తీ పూర్తి అయ్యే అవకాశం కన్పించడం లేదు. కొన్ని శాఖలు ఖాళీలు కొనసాగుతున్నాయి. వాటిని అదనపు బాధ్యతలతో భర్తీ చేసే అవకాశం ఉంది. మండలంలోని పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పోస్టులు అదనపు బాధ్యతలతో నుడుస్తున్నాయి. ప్రస్తుత బదిలీలో కూడా భర్తీ అయ్యే అవకాశం కన్పించడం లేదు. పలు శాఖల్లోని అధికారులు పదవీ విరమణ చేయడంతో ఆయా పోస్టుల భర్తీ జరగలేదు. దీంతో ఏఈల పోస్టులు అధికంగా ఖాళీలే ఏర్పడుతున్నాయి. ప్రస్తుత బదిలీల్లో ఆకివీడు మండల వ్యవసాయాధికారి బుట్టాయిగుడెం బదిలీ కానున్నారు. ఆ స్థానంలో ఎవరూ చేరేందుకు ముందుకు రాలేదు. ఆయా పోస్టులు భర్తీకి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

బొండాడలో మురుగు డ్రెయిన్ నిర్మాణ పనులు



బొండాడలో మురుగుడ్రైన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ నాగరాజు

కాళ్ల: గ్రామాల్లో పరిశుభ్రత పారిశుద్యానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు శివారు గ్రామాలకు సైతం స్వచ్ఛమైన నీరు అందించాలనే ఉద్దేశంతో గ్రామంలో ఎక్కడ మురుగు నీటి నిల్వ లేకుండా చర్యలు కుంటున్నామని బొండాడ సర్పంచ్ మన్నే వరలక్ష్మి నాగరాజు అన్నారు. కాళ్ల మండలం బొండాడ గ్రామంలో మురుగునీరు మురుగు కాలువలోకి తరలి వెళ్లేందుకు నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ మురుగుడ్రైన్ డ్రెయిన్ నిర్మాణపనులను బుధవారం పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో వాడకంనీరు నేరుగా పంటకాలవలో కలవడంతో శివారు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నేరుగా మురుగు కాలువలో కలిసే విధంగా పైపులు, తూములతో సుమారు 300 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మాణం చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, నాణ్యతలో రాజీపడకుండా పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రానున్న వారంరోజులు లోపు పనులు పూర్తి చేసి గ్రామంలో ఎక్కడా మురుగు నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈయన వెంట మన్నే సోమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కదలని సబ్‌స్టేషన్ నిర్మాణం

- ఏడాది పాలనలో పట్టించుకోని కూటమి సర్కార్
- రూ.133 కోట్లతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంకల్పించిన గత ప్రభుత్వం
- టెండర్ దశలో నిలిచిన భారీ సబ్‌స్టేషన్ పనులు
- తప్పని లోఓల్టేజ్ వెతలు



నరసాపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్

నరసాపురం: నరసాపురంలో భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూనుకుంది. అయితే టెండర్ దశకు చేరుకున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణం ఫైల్‌ను కూటమి సర్కార్ మూలనపెట్టేసింది. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే విద్యుత్ వెతలు తీరతాయని ఆశించిన ప్రజలకు ఈ వేసవి మొత్తం లోఓల్టేజ్ వెతలు తప్పలేదు. విద్యుత్ లోఓల్టేజ్ సమస్యలకు చెక్ పెట్టేందుకు రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్థ్యంతో సబ్‌స్టేషన్‌ను నరసాపురం పట్టణం రుస్తుంబాదలో నిర్మించతల పెట్టారు. ఈ మేరకు గత ప్రభుత్వం జీఓ 2368ని 2021 ఫిబ్రవరి నెలలో విడుదల చేసింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టడానికి సన్నాహాలు చేశారు. అయితే ప్రభుత్వం మారడంతో పనులకు అతీగతీ లేకుండా పోయాయి.

లో ఓల్టేజ్ వెతలు తీర్చాలని

నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌లో గతంలో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. 2020 సంవత్సరంలో ఆ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకు పెంచారు. మళ్లీ అదనంగా దానికి అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న కొత్త 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతోకాలంగా విద్యుత్ లోఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని గత ప్రభుత్వం సంకల్పించింది. వెంటనే రుస్తుంబాదలో 10 ఎకరాల స్థలం సేకరించింది. ఈ ప్రాజెక్ట్ ఏమయిందనే అంశంలో కనీసం కూటమి ప్రభుత్వం ఓ ప్రకటన కూడా చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు మొదలు పెట్టాలి



కొత్త సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిన వెంటనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈలోగా ఎన్నికల రావడంతో టెండర్లు పిలవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. నిధులు అందుబాటులో ఉన్నాయి. టెండర్లు పలిచి పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలి. భారీ సామర్థ్యంతో కొత్త సబ్‌స్టేషన్ కట్టడం వల్ల ఇక విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండవు. నాడు ఈ భారీ ప్రాజెక్ట్‌కు ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు రూపకల్పన చేశారు.

– వైకేఎస్, కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

ఆచార్య ఎన్‌జీ రంగా పురస్కారాలు

ఉండి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ ద్వారా డాక్టర్ ఎంవీ రెడ్డి ఉత్తమ రైతు పురస్కారానికి ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కేవీకే పరిధిలోని రామన్నపాలెంకు చెందిన అయితం ధాన్‌చంద్, సీఆర్ఐ పురస్కారానికి కాళ్ళ మండలం దొడ్డనపూడికి చెందిన కొల్లి నాగశ్రీనివాస్ ఎంపికైనట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ మల్లిఖార్జునరావు బుధవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులను ఈ నెల 12వ తేదీ గురువారం యూనివర్సిటీ ఆవిర్భావ సభలో అవార్డులు అందజేస్తారని ఆయన తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్సై పి ప్రేమరాజు బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి గ్రామానికి చెందిన చిట్టిఅప్పారావుతో కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన సాయిదీపికతో ఈఏడాది ఫిబ్రవరిలో వివాహం అయింది. అప్పారావు తణుకులో జొమోటోలో డెలివరీబాయ్‌గా పనిచేస్తున్నాడని, పది రోజుల క్రితం భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగిందని, దానిని పెద్దల సమక్షంలో పరిష్కరించుకున్నారని చెప్పారు. ఈనెల 9న భార్యను అత్తిలి గ్రామానికి తీసుకువచ్చాడని, ఈనెల 11న అప్పారావు డ్యూటీ నిమిత్తం తణుకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో భార్య సాయి దీపిక ఇంటి నుండి బయటకు వెళ్లిపోయిందని, పరిసర ప్రాంతాలలో వెతికినా ఆచూకి లభించక పోవడంతో భర్త అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు చెప్పారు.